
# నాన్నా! నన్ను క్షమించవూ?

ఆకాశం నల్ల దుప్పటి కప్పుకున్నట్లు దట్టంగా మబ్బు పట్టి ఉంది. ఆ దుప్పటి మీద తెల్లని మాసికల్లా, అక్కడక్కడ నీలి రంగు ఆకాశం తొంగి చూస్తుంది. గాలి బలంగా వీస్తుండడం వల్ల, ధూళి ఎగిరెగిరి పడుతోంది.

చల్లగాలికి ఆరు బయట జామి చెట్టు క్రింద



మందరపు ఉమాలక్ష్మి

పడుకున్న రాఘవరావు ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు. సన్నసన్నగా జల్లు కురియడంతో, రాఘవరావు మంచం మీద నుండి లేవబోయాడు.

ఇంతలోనే తీవ్రంగా దగ్గు తెర రావడంతో ఉక్కిరిబిక్కిరి అయి, మంచంలోనే కూలబడిపోయాడు. రాఘవరావు ఖణేల్, ఖణేల్మని దగ్గుతూనే ఉన్నాడు. ఉరుములు, మెరుపులతో వాతావరణం మరింత భీభత్సంగామారింది.

సన్నగా కురిసిన జల్లు, ఉన్నట్టుండి జోరుగా కురవసాగింది. రాఘవరావు శరీరం, మంచు ముద్దలా చల్లబడిపోయింది. అతడింకా దగ్గుతూనే ఉన్నాడు. దగ్గి దగ్గి వాంతి చేసుకుంటున్నాడు. వర్షపుధారల్లో, అతడి నోటి నుండి వచ్చిన ఎఱ్ఱని నెత్తురు, కరిగి, మట్టిలో కొట్టుకుపోతుంది.

చేతి కఱ్ఱ పట్టుకొని, మెల్లగా లేవబోయి, తూలి క్రిందపడిపోయాడు. చిక్కటి బురదలో వానపాములా కూరుకుపోయాడు.

వర్షపుహోరు, ఈదరగాలి, అతడిని అడుగు ముందుకు వెయ్యనివ్వడం లేదు. గొంతు పెగుల్చుకొని "జానకీ" అని పిలిచాడు.

అక్కడే వరండాలో పడుకున్న జానకికి, వర్షపు హోరులో ఆ పిలుపు వినిపించలేదు. అంత వరకు భర్తకు సేవలు చేసి, అప్పుడే కునుకు తీసిన ఆమె గాఢ నిద్రలోకి వెళ్ళిపోయింది.

భర్త పిలుపు వినబడలేదా అన్నట్లు వర్షపు జల్లు వరండా మీద పడుకున్న జానకి మీద కొట్టింది.

చల్లని జల్లు ముఖానికి తగలడంతో ఉలిక్కిపడి కళ్ళు విప్పింది.

ఎదురుగా జామి చెట్టు క్రింద పడుకున్న భర్త మంచం వైపు చూసింది ఆత్రంగా.

అతడు మంచం మీద కనబడకపోయేసరికి, ఆత్రంగా వానలో తడుస్తూ జామి చెట్టు దగ్గరికి నడిచింది.

అక్కడ బురదలో కూరుకుపోయి ఉన్న భర్తని చూసేసరికి, గుండె ఆగినట్లయ్యింది.

"అయ్యయ్యో!- వర్షంలో పూర్తిగా

తడిసిపోయారు. త్వరగా ఇంట్లోకి నడవండి..." అని అతడిని లేవదియ్యాబోయింది.

కానీ అప్పటికే రాఘవరావుకి ఆయాసం ఎక్కువగా రావడంతో స్పృహ తప్పి, ఉన్న చోటనే కూలబడిపోయాడు.

ఇక ఏమి చెయ్యలేక నిస్సహాయంగా కొడుకు గది వైపు పరిగెత్తింది.

ఆత్రంగా తలుపు బాదింది.

విసుక్కుంటూ తలుపు తీసాడు కృష్ణ.

ఎదురుగా శోకమూర్తిలా నిల్చున్న తల్లిని చూసి "ఏంటమ్మా! ఏమైంది?" అన్నాడు చికాగ్గా!

"బాబూ! మీ నాన్నగారు స్పృహ తప్పి పడిపోయారు. కొంచెం ఆయన్ని లేవదియ్యరా! వర్షంలో తడిసిపోతున్నారు." అంది ఏడుస్తూ!

"అమ్మా! అసలే ఆయన జబ్బు మనిషి. ఆరు బయట పడుకుంటే ఏమవుతుంది?" అని విసుక్కుంటూ అక్కడ నుండి కదిలాడు.

రాఘవరావుని రెండు చేతులతో లేవనెత్తి గదిలో మంచం మీద పడుకోబెట్టాడు కృష్ణ!

జానకి ఏడుస్తూనే రాఘవరావు ఒళ్ళంతా తుడిచింది.

"బాబూ! త్వరగా వెళ్ళి డాక్టరుగారిని తీసుకురా! మీ నాన్నగారిని చూస్తుంటే నాకెందుకో భయంగా వుంది." అంది.

"ఇంత రాత్రివేళ ఏ డాక్టరును తీసుకురాను. బంగారం లాంటి నిద్ర చెడగొట్టావు. రోజు రోజుకీ ఇల్లొక నరకం లాగ తయారవుతుంది" విసుగ్గా అన్నాడు కృష్ణ!

"కృష్ణా! ఇప్పుడు నీ నిద్ర మానుకుని, డాక్టరుని తీసుకురాకపోతే! ఆయన శాశ్వతంగా నిద్రపోతారు. అప్పుడు... అప్పుడు నీకు సుఖంగా నిద్రపడుతుంది. మీ నాన్నగారు పోయిన రోజే, నన్ను కూడా ఆయనతో పాటు, సజీవ సమాధి చెయ్యి. అప్పుడు నీకు ఏ అడ్డు ఉండదు అంది కోపంగా!

"ఏమన్నా అంటే నీకు కోపం వస్తుంది. ఆ జబ్బు మనిషి పాకలో పడుకోక, తగుదునమ్మా అని

# నాన్నా! నన్ను క్షమించవూ?

నామిద పెట్టు కంచ పడుకోవడం దేనికి? ఇప్పుడు ఆయన రోగానికి, నాకెంత ఖర్చవుతుంది? ఛ! ఛ! పొత్తిగా ఇంట్లో శాంతి లేకుండా పోతుంది. అర్థరాత్రనక, అపరాత్రనక, నేను డాక్టర్ల చుట్టూ తిరిగేసరికి సరిపోతుంది. పెద్దవాళ్ళేగాని మీరు పరిస్థితులని ఏమి అర్థం చేసుకోవడం లేదు." అని విసురుగా అక్కడ నుండి కదిలాడు.

*     *     *

ఆ రోజు యధాప్రకారంగా తెల్లవారింది.

రాఘవరావుకి మూడో రోజున స్పృహ వచ్చింది. ఆ మూడు రోజులూ, తిండి, నిద్రా మాని, భర్త మంచం ప్రక్కనే కూర్చునేది జానకి.

అంత వరకు ఏడ్చి, ఏడ్చి, అలసిపోయి అలా మంచం కోడు మీద తలవాల్చి నిద్రలోకి జారిగిపోయింది జానకి.

రాఘవరావు కళ్ళు తెరిచి చూసేడు.

బుగ్గల మీద కన్నీటి చారికలతో, చిక్కి శల్యమైన రూపంతో, కళా విహీనంగా ఉన్న జానకిని చూడగానే అతడి హృదయం కలుక్కుమంది. అప్రయత్నంగా అతడి మనసు గతం వైపు పరుగులు తీసింది.

జానకి తనను పెళ్ళి చేసుకొని ఏం సుఖపడింది! తను చేసేది గుమాస్తా ఉద్యోగం. చాలీ చాలని జీతంతో, రోజులు ఈడ్చుకొచ్చేది. తను నీతికి, నిజాయితీకి కట్టుబడడం వల్ల, అందరిలాగ డబ్బు సంపాదించలేకపోయాడు. కానీ ఆ నిజాయితీయే తనని గుమాస్తా నుండి ఆఫీసరుని చేసింది. ఆఫీసరు అయాక రెండు, మూడేళ్ళు ఏం సుఖం అనుభవించిందో అంతే!

తనకి వచ్చిన ప్రావిడెంట్ ఫండ్‌తో, ఇద్దరి కూతుళ్ళ పెళ్ళి ఉన్నంతలో ఘనంగానే జరిపించాడు ఇక మిగిలినవాడు కృష్ణ! ఈ ఇంటికి, వంశానికి వాడొక్కడే వారసుడు. కృష్ణకి తను ఏమి మిగల్చలేకపోయాడు. కృష్ణకి ఎలాగో డిగ్రీ వరకు చెప్పించగలిగాడు. కృష్ణ అదృష్టమో తన అదృష్టమో గానీ, కృష్ణ కూడా తనలాగే గుమాస్తా అయ్యాడు. వాడిని ఒక ఇంటివాడిని చేసినంత వరకు నిద్రపోలేదు జానకి.

ఒకప్పుడు వాడికొచ్చే జీతం, తన చేతిలో పెట్టేవాడు. తనుఇలాగ మూల పడిన దగ్గర నుండి, ఆ జీతం కోడలి చేతిలోనే పెడుతున్నాడు. డబ్బు నీళ్ళలాగ ఖర్చయింది తన జబ్బుకి.

తనకి జబ్బు చేసిన దగ్గర నుండి, కోడలి విసుర్లు, కొడుకు నిరాదరణ గమనిస్తూనే ఉన్నాడు. తనని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిందిజానకి. పద్మా, జ్యోతి, ఒకసారి వచ్చి, తనని చూసి వెళ్ళిపోయారు. ఆ తర్వాత తన గురించే వాళ్ళకి అక్కరలేకపోయింది. ఏమిటో ఎవరికీ అక్కరలేని బ్రతుకైపోయింది.తన దగ్గర డబ్బులుంటే వాళ్ళంతా, మానాన్నే మానాన్నే అని తన చుట్టూ తిరగరూ.

తన కష్టాలు, సుఖాలు చెప్పుకొనేది తన ప్రాణమిత్రుడు రంగనాథం దగ్గరే! రంగనాథం లాటరి టిక్కెట్లు అమ్మేవాడు. ఎప్పుడూ తనని చూసి "ఒరే! రాఘవా! నీకేం భయంలేదు. నువ్వు త్వరలో లక్షాధికారివవుతావు? నీ బిడ్డలు నిన్ను నెత్తి మీద పెట్టుకుని పూజిస్తారు." అని ప్రతిసారి తనకొక లాటరి టిక్కెట్టు ఇచ్చేవాడు.

తనలో ఏమూలో, ఒక మూల ఆశ పుట్టడమో, రంగనాథం మాటల ప్రభావమోగాని, తనకి లాటరి టిక్కెట్టు కొనడం అలవాటైపోయింది. తన అదృష్టం బాగుండి, ఈసారన్నా లాటరిలో ఫస్టు ప్రైజు వస్తే, జానకిని ఆప్యాయంగా చూసుకుంటాడు కృష్ణ! ఇక అప్పుడు తను పోయినా ఫర్వాలేదు.

ఆలోచనలని కట్టిపెట్టి, మెల్లగా 'జానకి' అని పిల్చాడు.

నిద్రావస్తలో ఉన్న జానకి ఆ పిలుపుకే ఉలిక్కిపడి, కళ్ళు తెరచి "ఏమండి, పిలిచారా!" అంది ఆత్రంగా.

"దా.... దాహం...." అన్నాడు నోరు పెగల్చుకొని.

వెంటనే కూజాలో నీళ్ళు ఒలిపి భర్త నోట్లో పోసింది.

"ఏమండీ! ఎలా ఉందండీ!" అంది అతడి గుండెల్ని చేత్తో రాస్తూ!

"బా.... బాగానే వున్నానుగా... నువ్వు... నువ్వేం కంగారు పడకు." అన్నాడు ఆయాసంగా!

"ఏమండీ! కాస్త కాఫీ తెమ్మంటారా!" అడిగింది ఆత్రంగా.


"వద్దు జానకీ! ఒక్క నిమిషం నువ్వు నాఎదురుగా కూర్చో!" అన్నాడు ఆమె చేతిని పట్టుకొని కూర్చోమంటూ!

"ఏమిటండీ ఈ మాటలు. నాకు భయంగా వుంది" అంది ఏడుపు గొంతుతో.

"జానకీ! నాకు నీ గురించే బెంగ. నేను పోయాక కృష్ణ అసలు నిన్ను చూస్తాడా! నీకేమి మిగల్చకుండానే వెళ్ళిపోతున్నాను జానకీ!" ఆవేదనగా అన్నాడు.

"వద్దండి. అలా మాట్లాడకండి." అంది ఏడుస్తూ.

"జానకీ! నా డైరీ ఒక్కసారి తీసుకురా!" అడిగాడు.



జానకి వెంటనే ఆ డైరీ తీసుకు వచ్చి అతనికిచ్చింది.

అందులో భద్రంగా దాచిన లాటరి టిక్కెట్ తీసి 'జానకీ! ఒక్కసారి కృష్ణని పిలు'' అన్నాడు.

''అలాగే'' అని అక్కడ నుండి కదిలింది జానకి.

''బాబూ! కృష్ణా! నాన్నగారు నిన్నెందుకో పిలుస్తున్నారు'' అంది.

''ఎందుకమ్మా! అసలే నాకు ఆఫీసుకి టైం అయిపోతుంది.'' విసుగ్గాఅన్నాడు కృష్ణ...

''అలా విసుక్కోకురా! అసలే మీ నాన్నగారి ఆరోగ్యం బాగాలేదు.'' అంది జానకి మందలిస్తున్నట్టు.

''ఎలా బావుంటుంది?చెప్పినట్టు వింటేగా!రోగిష్టి మనిషైనా ఆరుబయట పడుకుంటే ఏమవుతుంది? ఇప్పుడొక మూడు వందల రూపాయల మందులు వాడితేగాని, ఆయన మనిషవ్వడు. అసలు ఈ తప్పంతా నీది. నాన్నగారు ఏదంటే అదే చేస్తావు?'' విసుగ్గాఅన్నాడు.

''పోనీలే బాబూ! అయిపోయిందేదో అయిపోయింది. ఒక్కసారి నాన్నగారికి కనిపించి, ఆఫీసుకి వెళ్ళు.'' అని వంట గదిలోకి నడిచింది.

అక్కడ అస్తవ్యస్తంగా పడి వున్న సామాన్లన్నీ ముందు వేసుకొని, తోమడానికి కూర్చుంది జానకి.

''ఏమండీ! ఒక్కసారి ఇలా రండి.'' పిలిచింది సునీత!

''వస్తున్నా డార్లింగ్!'' అని జుత్తు గబగబా దువ్వి ''ఎందుకో శ్రీమతిగారు కాలింగ్‌బెల్ మ్రోగించారు.'' అన్నాడు కొంటెగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

''ఈరోజు మీరు త్వరగా రావాలి.''

''ఎందుకు?'' విస్మయంగా అడిగాడు.

''షాపింగ్‌కి వెళ్ళాలి.''

''షాపింగ్‌కా! దేనికి?''

''దేనికేమిటండీ! మా చెల్లెలి పెళ్ళి పట్టుమని పది రోజులైనా లేదు. దానికో చీర, జాకట్టుపీస్ తీసుకోవద్దూ! మనం రేపో, ఎల్లుండో బయలుదేరి వెళ్ళాలి పెళ్ళికి.'' అంది.

''చిత్తం దేవిగారి ఆజ్ఞ! నేను నాలుగు గంటలకే వచ్చేస్తాను. మనం షాపింగ్ చేసి, అటునించి అటే.

# నాన్నా! నన్ను క్షమించవూ?

ఫస్ట్‌షో పిక్చర్‌కి వెళ్దాం. సరేనా!'' అన్నాడు ఆమెను దగ్గరగా తీసుకుంటూ!

''అబ్బ వదలండి. మీ అమ్మగారు చూస్తున్నారు.'' అంది అతడిని విడిపించుకుంటూ!

ఇంతలో ''బాబూ!'' అన్న రాఘవరావు పిలుపు వినిపించడంతో, సునీతని వదలి ముందు గదిలోకి నడిచాడు.

''ఎందుకు నాన్నా! అంత గట్టిగా కేకలేస్తారు? అసలే మీ ఆరోగ్యం బాగు లేదు. రాత్రంతా ఆ రోజు చల్లగాలిలో పడుకుని ఇంత వరకు తెచ్చారు. ఇప్పుడిలా అరుపులు, కేకలు వేసి మరింత ఎక్కువ చేసుకోవడానికా! నాకవతల ఆఫీసుకి టైం అయిపోతుంది. ''ఏమిటో చెప్పండి.'' అన్నాడు విసుగ్గా!

''ఈరోజే సువర్ణలక్ష్మి లాటరి ఫలితాలు తెలుస్తాయి. ఈ టిక్కెట్టు తీసి కెళ్ళి, ఈ నెంబరుకి ఏమైనా ప్రైజు వచ్చిందేమో కనుక్కోరా''

''ఈ వయసొచ్చినా ఇంకా మీకీ పిచ్చి పోలేదు.'' అని టిక్కెట్ అందుకున్నాడు.

''లేదురా కృష్ణా! ఈసారి తప్పకుండా ఈ టిక్కెట్‌కి ప్రైజు వస్తుందనిపిస్తుంది'' అన్నాడు ఆయాసంగా.

''ఎందుకలా ఎక్కువగా మాట్లాడతారు. ఆయాసం ఎక్కువైతే ప్రమాదం. కాస్త మాట్లాడకుండా కూర్చోవడం అలవాటు చేసుకోండి'' అని విసుగ్గాఅక్కడ నుండి కదిలాడు.

కొడుకు నిర్లక్ష్య వైఖరికి దీర్ఘంగా నిట్టూర్చాడు.

గుమ్మం దాటగానే లాటరి టిక్కెట్ ముక్కలు ముక్కలుగా చింపి పారేసి ''లాటరి వస్తుందట. ఈయనగారికి అదొక్కటే తక్కువ.'' అనుకొని అక్కడ నుండి కదిలాడు త్వరత్వరగా!

*　　*　　*

త్వరగా ఇంటికి వద్దామనుకున్న కృష్ణ, పని ఒత్తిడి వల్ల సాయంత్రం ఆరుగంటల వరకు ఆఫీసులో నే ఉండిపోవలసి వచ్చింది.

తను ఆలస్యంగా ఇంటికి వెళుతున్నందుకు, సునీత ఏమంటుందో, అలిగి భోజనం కూడా మానేస్తుంది.

ఏమిటో బొత్తిగా మొండిదైపోతుంది. అనుకొని ఆలోచిస్తూ త్వరత్వరగా సైకిల్ తొక్కసాగాడు.

ఒక షాపు దగ్గర జనం గుంపులుగా కూడి ఏదో అనుకుంటున్నారు.

ఏమిటో అనుకుని సైకిల్ అటు పోనిచ్చాడు.

''ఏమిటి? ఏమైంది?'' అందరూ ఇక్కడ ఎందుకు మూగారు?'' అడిగాడు ఆ గుంపులో ఒక మనిషిని.

''ఇప్పుడే సువర్ణలక్ష్మి లాటరి ఫలితాలు తెలిసాయి. ఎవరో రాఘవరావట! అతనికి లక్ష రూపాయల ప్రైజు వచ్చింది'' అన్నాడు అతడు వెళ్ళిపోబోతూ!

''రాఘవరావా! అతనిది ఏ వీధో తెలుసా!'' ఆశ్చర్యంగా అడిగాడు.

''ఏమో! నాకు తెలియదండి. వెళ్ళి ఆ షాపతన్ని అడగండి'' అని వెళ్ళిపోయాడు.

అందరిని త్రోసుకుని లోపలకి వెళ్ళి ''ఏమండీ! లక్ష రూపాయల ప్రైజు ఎవరికి వచ్చింది?'' అని అడిగాడు ఆత్రంగా.

''మీ నాన్నకేనయ్యా! మీ నాన్న నా ఫ్రెండు. వాడి లాటరి టిక్కెట్ నెంబరు ప్రతిసారి నా డైరీలో నోట్ చేసుకుంటాను. రిజల్ట్సు వచ్చేకన్నా ముందే వాడు నా దగ్గరికి వచ్చేవాడు. ఈ రోజు ఇంకా రాలేదు. ఈ దెబ్బతో వాడి దరిద్రం తీరింది.'' ఉత్సాహంగా అంటున్నాడు ఆ షాపు యజమాని.

కృష్ణకి ఒక్కసారి గుండె ఆగినట్లయ్యింది. లక్ష రూపాయలు... లక్ష రూపాయలు. చేజేతులారా పోగొట్టుకున్నాను. ఈ సంగతి తెలిస్తే ఆయన నన్ను క్షమిస్తారా! అనుకుని ఇక అక్కడ ఒక క్షణం నిలబడలేక గబ గబ, ఇంటి వైపు సైకిల్‌ని పోనిచ్చాడు.

ఇంటి ఆవరణలోకి అడుగు పెడుతూనే చైతన్యరహితంగా నిలబడిపోయాడు.

రాఘవరావు శవం మీద పడి, వెక్కి వెక్కి ఏడుస్తున్న జానకమ్మను ఓదార్చడానికి, ఎందరో ఆడవాళ్ళు ప్రయత్నం చేస్తున్నారు. ఆమె శోకాన్ని ఎవరూ తగ్గించలేకపోతున్నారు. సునీత ఒక ప్రక్కగా నిల్చుని ఉంది మౌనంగా!

''అమ్మా! ఊరుకో అమ్మా!'' అని ఆమెను లేవనెత్తి, కన్నీళ్ళు తుడిచాడు కృష్ణ!

కొడుకును చూడగానే ఆమె కళ్ళు గట్టు తెగిన కాల్వలయ్యాయి. ''బాబూ! మీ నాన్నగారు మనల్ని వదిలి వెళ్ళిపోయారురా! ఇక ఆయన మనకి లేరురా లేరు.'' అంది వెక్కి వెక్కి ఏడుస్తూ.

కృష్ణ కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి.

''నాన్నా! నన్ను క్షమించు నాన్నా!'' అని అతడి పాదాలు పట్టుకొని ఏడుస్తున్నాడు కృష్ణ పశ్చాత్తాపం నిండిన స్వరంతో! □

